క్లుప్తంగా

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా చేపట్టినట్లు ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్‌స్థాయిలో పార్టీ శ్రేణులు 50శాతం క్రియాశీలక సభ్యత్వాలను స్వీకరించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవ రావు, పట్టణ అధ్యక్షులు ఎ.నాగస్వామి, మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీను, సుబ్రమణ్యం, వసంతరావు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో మహిళలు, పిల్లలను భయభ్రాంతులకు గురి చేస్తూ అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని ఆదివారం రాత్రి సత్తుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రజలపై దుర్భాషలాడుతుండటంతో వారు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పాడి గేదె మృతి

మధిర: మండలంలోని చిలుకూరు వద్ద వైరా నదిపై నిర్మించిన చెక్ డ్యాంలో నీటి వరద ప్రవాహం ఉధృతి ఎక్కువగా ఉంది. ఆదివారం ఈ వరద ప్రవాహంలో తాళ్లూరి రాంబాబుకు చెందిన రూ.లక్ష విలువైన పాడి గేదె కొంత దూరం కొట్టుకుపోయి మృతి చెందింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రాంబాబు వాపోయాడు.

వైద్య శిబిరం విజయవంతం



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బోనకల్: మండల కేంద్రంలోని బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్యాధికారి పవన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడ మందులను బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బత్తినేని నాగప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రోషన్‌కుమార్, ఆనందరావు, పవన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బొర్రా రాజశేఖర్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి 7వ వార్డుకు చెందిన మత్స్యకారుడు కాంద్ర కాంతారావు కుమారుడు కాంద్ర కిరణ్ ఇటీవల మెడికల్ ర్యాంకు సాధించి కరీంనగర్‌లోని ప్రతి వైద్య ప్రైవేట్ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ విద్యార్థికి రూ.10 వేలు ఆదివారం అందజేశారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు షేక్.రహీం, మధు, సైదులు, కుదాన్, బాషా, సైదా ఖాన్, సలీం, భూషణం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



మధిరలోని సేవా సదనంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా సేవా సదనంలో ఆదివారం ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కొండూరు మండలం అట్లప్రగడ గ్రామానికి చెందిన వజ్రాల జమలారెడ్డి సతీమణి కోటేశ్వరమ్మ మూడో వర్ధంతి సందర్భంగా ఆమె మనమరాళ్లు హిషిత, నిఖిత ఆర్థిక సాయంతో దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సదనం నిర్వాహకులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'కే మొగ్గు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తప్పని ఇక్కట్లు
- ధర తక్కువైనా ఇదే నయం అంటున్న రైతులు
- తేమశాతం చూడకుండా కొనుగోళ్లు



సన్నరకం ధాన్యాన్ని కాంటా వేస్తున్న హమాలీలు

కల్లూరురూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కోతలు విధిస్తున్నారని ఎంతమొత్తుకున్నా సంబంధిత అధికారుల పట్టించుకోవడం లేదు. దీంతో చేసేదేమి లేక పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.2,320లతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో క్వింటాకు రూ.2,820 రైతులకు గిట్టుబాటు అవుతుంది. అయినప్పటికీ రైతులు ఇవేమీ పట్టించుకోకుండా.. ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

ప్రైవేట్ వైపే రైతుల మొగ్గు..

కల్లూరు మండలంలో మొత్తం 35వేల ఎకరాలకు గానూ.. 23వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యంను రైతులు పండించారు. ప్రభుత్వం మండలంలో 29 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తున్నప్పటికీ రైతులు ప్రైవేట్ వారికే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. సన్నరకం ధాన్యానికి ప్రైవేట్ వ్యాపారులు సుమారు 78కిలోలకు గానూ.. రూ.1,450 చెల్లిస్తున్నారు. దీంతో ధాన్యం కోసిన వెంటనే పచ్చి ధాన్యాన్ని కాంటా వేసి ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందికంగా ఎఫ్‌సీఐ నిబంధనలు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్‌సీఐ పెట్టిన నిబంధనలు రైతులకు ఇబ్బందికంగా మారాయి. ధాన్యంలో తాలు, తేమ శాతం, మట్టి పెల్లలు తదితర అంశాలపై నిబంధనలు కఠినంగా ఉండటంతో రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వరిపైరు కోసిన తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టడం ప్రస్తుత పరిస్థితిలో వీలుపడని అంశం. వాతావరణ పరిస్థితులు మారుతుండటం, వర్షాలు పడుతుండటంతో రైతులు తామ కోసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి వీలు లేకుండా ఉడడంతో.. పచ్చి ధాన్యాన్ని వ్యాపారులకు రైతులు విక్రయిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయటం లేదు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి సరైన స్థలంతో పాటు ప్లాస్టిక్ పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎఫ్‌సీఐ పెట్టిన నిబంధనలు పాటించాలంటే అన్ని సౌకర్యాలు ఉండాలి. దీంతో వడ్లు కోసిన వెంటనే పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నాం.

– పువ్వాళ్ల వెంకటేశ్వరరావు, రైతు, యజ్ఞనారాయణపురం

అకాల వర్షాల కారణంగా..



అకాల వర్షాలకు భయపడి సన్న ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి కోసిన వెంటనే ధాన్యం ఆరబెట్టేందుకు సరైన వసతులు లేకపోవడమే ఒక కారణం. వర్షం పడితే ధాన్యం తడిసిపోయి నష్టం వాటిల్లుతుంది. సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. రైతుల్లో నెగిటివ్ ఆలోచన ఉండడంతో చాలా మంది ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు.

– సాయిన్ని నారాయణరావు, రైతు, పుల్లయ్యబంజరు

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కారేపల్లి క్రాస్‌రోడ్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: కారేపల్లిక్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విశ్వనాథపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన మోసానికి రూ.7వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడిందని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తామని, ఇప్పటికే ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, గ్యాస్‌కు రూ.500లు, రైతు పండించిన ధాన్యంకు రూ.500ల బోనస్, రైతు రుణమాఫీలను దఫాలవారిగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ నవీన్‌బాబు, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఏఓ అశోక్‌కుమార్, సొసైటీ డైరెక్టర్లు ఐలయ్య, హీరాలాల్, రోశయ్య, రామారావు, ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నానాయక్ విగ్రహ ఆవిష్కరణ..

మండలంలోని సూర్యతండా గ్రామానికి చెందిన రైల్వే సబ్‌కాంట్రాక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. కాగా.. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చిన్నానాయక్ జ్ఞాపకార్థం సూర్యతండాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయగా దానిని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీలు దేవ్లానాయక్, పద్మావతి పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ మహోత్సవం



18 మెట్లకు జ్యోతి వెలిగిస్తున్న స్వాములు

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో శనివారం అర్ధరాత్రి వరకు అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఎర్రి నరసింహారావు స్వామి ఆధ్వర్యంలో మల్లవరం అయ్యప్ప మండపంలో పడి పూజ కన్నుల పండువగా జరిగింది. అర్చకులు కంచెల సతీష్ శర్మ, గురుస్వాములు గణపతి పూజ, పదునెట్టాంబడి నిర్వహించారు. అయ్యప్ప స్వామి పంచామృతాలు, నవరసాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్పా, హరి హర సుతయే శరణం అయ్యప్పా అంటూ భక్తులు జయ ధ్వానాలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తి గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదములు, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దొనకొండ కృష్ణయ్య, గుడిపల్లి సత్యం, దాసరి వెంకటేశ్వర్‌రావు, దుగ్గిదేవర తిరపతరావు, రాము పాల్గొన్నారు.

అయ్యవారిగూడెం గ్రామంలో..

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో అయ్యప్ప దీక్ష తీసుకున్న వేమిరెడ్డి రామకోటారెడ్డి గృహంలో శనివారం రాత్రి శ్రీఅయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో గురుస్వామి నాగేశ్వరరావు గురుస్వామి చేత శాస్త్రపరంగా పడిపూజ నిర్వహించారు. ప్రముఖ గాయకుడు కోదాడ గజ్జెల శ్రీను గురుస్వామి శ్రీఅయ్యప్ప భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అయ్యప్ప దీక్షాపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎర్రుపాలెం: అయ్యవారిగూడెంలో పడిపూజ చేస్తున్న భక్తులు

ఘనంగా సకల జనుల వనసమారాధన



ఆలయ నిర్వాహకులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీప్రసన్న గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం మనగుడి ప్రాంగణంలో కార్తీకమాసం సందర్భంగా సకల జనుల వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, దయానంద్ పాల్గొని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. అనంతరం మనగుడి నిర్మాణానికి సత్తుపల్లి గీతాంజలి విద్యాలయం కరస్పాండెంట్ చీకటి శ్రీనివాసరావు అందించిన రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు సత్కరించారు. అనంతరం సామూహిక వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో కామాయపాలెం శ్రీదత్తసాయి ఆశ్రమ నిర్వాహకులు అవగాహనంద భారతి స్వామి, కూసంపూడి శ్రీనివాసరావు, క్రాంతికుమార్, చల్లగుళ్ల నర్సింహారావు, నాయుడు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, పూచి గోవర్ధన్, లక్కినేని ప్రసాద్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, చెన్నారావు, సరస్వతి పాల్గొన్నారు.

ఖోఖో బాలికల శిక్షణా శిబిరం సందర్శన



శిక్షణ పొందిన క్రీడాకారులతో నీరజాదేవి

కల్లూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న అండర్–17 బాలికల ఖోఖో శిక్షణా శిబిరాన్ని ఆదివారం కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి సందర్శించారు. శిక్షణ మంచిగా తీసుకుని ఖమ్మం జిల్లా జట్టును విజయపథంలో నడిపించాలని కోరారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులను అభినందించారు. 7వ తేదీ వరకు ఈ శిక్షణా శిబిరం ఉంటుందని 8, 9, 10 తేదీల్లో కల్లూరులో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు వీరరాఘవయ్య పేర్కొన్నారు.

కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గాబ్రేలు

ఎర్రుపాలెం: తెలంగాణా తెలుగు నాటక సమాజాల సమైఖ్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జమలాపురం గ్రామానికి చెందిన ముల్లంగి గాబ్రేలు ఖమ్మంలో ఆదివారం జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయనతో పాటు మండలానికి చెందిన జిల్లా సంయుక్త కార్యదర్శిగా బూసిపల్లి బూసిరెడ్డి, ప్రచార కార్యదర్శిగా రాజేశ్వరరావులు ఎన్నికయ్యారు. వీరిని స్థానిక కళాకారులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ తల్లాడ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ సమక్షంలో నూనత కమిటీ ఎన్నిక జరిగింది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎక్కిరాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సురేష్, అధికార ప్రతినిధిగా ఆదూరి సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా వైద, రఘు, శివ, కార్యదర్శిగా కత్తి శివ, ప్రచార కార్యదర్శిగా ఎక్కిరాల శ్రీనులను ఎన్నుకున్నారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం

వైరారూరల్: మెస్ చార్జీల పెంపుపై.. మండల పరిధిలోని ముసలమడుగు గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి.. ప్రిన్సిపాల్ మాధవిలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థినులు, అధ్యాపక బృందం కృతజ్ఞతలు తెలిపారు.

జామె మసీద్ సదర్‌కు సత్కారం



మసీద్ సదర్ నాయబ్ రసూల్‌ను అభినందిస్తున్న మంత్రి పొంగులేటి

సత్తుపల్లి: సత్తుపల్లి జామెమసీద్, మార్కెట్ మసీద్ సదర్‌గా నూతనంగా ఎన్నికైన నాయబ్ రసూల్‌ను రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబులతో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ముస్లిం సమాజం గర్వపడే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రాండ్ మౌలాలీ, షేక్.రఫీ, ఆదిల్‌షరీఫ్, యూసుఫ్, మాజిద్, షఫీ, భాషావలీ, అనాస్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పొలం బాట



లచ్చగూడెంలో పొలంబాటను నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

చింతకాని: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలంబాట కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని విద్యుత్ మండల ఏఈ చావా శ్రీధర్ తెలిపారు. ఆదివారం మండలంలోని లచ్చగూడెం గ్రామంలో విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ విద్యుత్ మోటార్ల వద్ద తగిన కెపాసిటీ కలిగిన కెపాసిటర్లను అమర్చుకోవాలని కోరారు. గ్రామంలో పలువురు రైతులు విద్యుత్‌కు సంబంధించిన పలు సమస్యలను అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ కిషన్, రైతులు సీతయ్య, అచ్యుత్‌రావు, నాగభూషణం, సత్యనారాయణ, శ్రీను, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో అయ్యప్పస్వాముల మండల దీక్ష ప్రారంభం



కారేపల్లిలో అయ్యప్పస్వామి దీక్ష స్వీకరించి, పూజలు చేస్తున్న మాలధారులు

కారేపల్లి: హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి మండల దీక్షాధారణ కారేపల్లిలో ఆదివారం ప్రారంభమైంది. కారేపల్లిలోని గంగమ్మతల్లి దేవాలయం సమీపంలోని సింగరేణి కాలరీస్ సంస్థ నిర్మించిన కమ్యూనిటీ హాల్లో అయ్యప్పస్వామి పీఠాన్ని స్థాపించి, మాలధారులు మండల దీక్ష పూజలను ప్రారంభించారు. కార్యక్రమంలో పూజారి నాగసాయిశర్మ, గురుస్వాములు పాలిక సారయ్య, శ్రీనివాస్, సాయి, అయ్యప్ప మాలాధారులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

ఎర్రుపాలెం: మండలంలోని పలు చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లు తెగిపోయాయి. దీంతో గత రెండు నెలలుగా మండలంలో గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై గత నెల 2న సాక్షిలో ‘కన్నీటి కష్టాలు’అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయం భట్టికి తెలుపడంతో స్పందించిన ఆయన మరమ్మతులకై రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. అయినా తరచూ వర్షాలు కురియడంతో కట్లేరులో ప్రవాహం తగ్గక పనుల్లో ఆలస్యం జరిగింది. కానీ ఎట్టకేలకు భట్టి చొరవతో పనులు పూర్తిచేసి ఆదివారం గ్రామాల్లో నీటిని సరఫరా చేశారు.

ఎన్నెస్పీ కాలువకు..



గండి పడిన చింతకాని మేజరు కాలువకు మరమ్మతు చేయిస్తున్న ఎన్నెస్పీ అధికారులు

చింతకాని: ఎన్నెస్పీ చింతకాని మేజరు కాలువకు బస్వాపురం గ్రామ సమీపంలో ఇటీవల గండి పడటంతో ఎన్నెస్పీ అధికారులు మరమ్మతు పనులను ఆదివారం చేపట్టారు. కాలువకు గండి పడి నీరు వృథాగా పోతుండటంతో అధికారులు చింతకాని మేజరు కాలువకు నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ మరమ్మతు పనులు మూడురోజుల్లో పూర్తిచేసి కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి

కొణిజర్ల: రైతులకు వానాకాలం పంటలకు రైతుబంధు ఇవ్వాలని కోరుతూ.. సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు పిలుపునిచ్చారు. ఆదివారం కొణిజర్లలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. , రూ.2 లక్షలు రుణమాఫీ అర్హులందరికీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కొత్త మేడేపల్లిని సందర్శించిన ఎస్సై



కొత్తమేడేపల్లిలో గిరిజన చిన్నారులతో ఎస్సై రఫీ, సిబ్బంది

ఏన్కూరు: మండలంలోని కొత్త మేడేపల్లి గిరిజన గ్రామాన్ని ఆదివారం ఏన్కూరు ఎస్సై ఎస్కే రఫీ సందర్శించారు. గిరిజనులను కలిసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రస్తుతం 45 కుటుంబాల్లో 150 మందికి పైగా నివసిస్తున్నట్లు స్థానిక గిరిజనులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పండ్లు, ఇతర వస్తువులు అందజేశారు. బయటి ప్రాంతం నుంచి ఎవరు వచ్చినా వారికి ఆశ్రయం ఇవ్వకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామం నుంచి బయటకు వెళ్లి పోయిన వారి వివరాలు కూడా పోలీసు వారికి ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులు హక్కులను సాధించుకోవాలి



మాట్లాడుతున్న మహేంద్రనాథ్

సత్తుపల్లిరూరల్: దివ్యాంగుల హక్కుల చట్టాన్ని సద్వినియోగం చేసుకొని చట్టంలోని హక్కులను పోరాడి సాధించుకోవాలని మానవ హక్కుల సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఇనపనూరి మహేంద్రనాథ్ అన్నారు. స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో దివ్యాంగుల హక్కులు, చట్టాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. దివ్యాంగులకు భారత ప్రభుత్వం అనేక రకాల పథకాలను ప్రవేశ పెట్టిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత లేనివాటికి దరఖాస్తు చేసి కార్యాలయాల చుట్టూ తిరగొద్దని, అర్హత కలిగిన వాటికే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు వలపర్ల రవికుమార్, కువ్వారపు విజయరావు, జి.వెంకటేశ్వరరావు, సునీత, రాజశేఖర్, భద్రయ్య, పి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో కుల గణన స్టిక్కరింగ్

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వే కోసం ఆదివారం ఎన్యూమరేటర్లు ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది.. ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లు అంటించి కుటుంబ యజమాని వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ నెల 5నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిరలో స్టిక్కరింగ్ చేస్తున్న సర్వే సిబ్బంది



బోనకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలో స్టిక్కర్లు అంటిస్తున్న అధికారులు



కల్లూరురూరల్: ఎన్యూమరేటర్లకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రాజేంద్రగౌడ్